క్లుప్తంగా

డిజిటల్ సేవలపై అవగాహన



సచివాలయాన్ని సందర్శించిన కేజీబీవీ విద్యార్థినులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కస్తూర్బా గాంధీ(ఉర్దూ) బాలికల పాఠశాల విద్యార్థినులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సచివాలయం-3ను సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న పలు రకాల డిజిటల్ సేవలపై సచివాలయ సిబ్బంది వారికి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ

డోన్ రూరల్: మండల పరిధిలోని తాడూరు గ్రామంలో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బంగారు జయచంద్ర, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సూర్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, నాగప్ప, శివకుమార్, రాఘవయ్య, కేశవయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసమే ఆయుధం



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు

బేతంచెర్ల: పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు రామచంద్రుడు, మాధవి, మహేంద్ర, గోపినాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాల్లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్, సభ్యులు విజయనాగరాజు, సత్తార్ పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: పట్టణ ప్రజలకు మంగమూరి కుటుంబ సభ్యులు ఎనలేని సేవ చేశారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్ అన్నారు. స్థానిక త్రివర్ణ కాలనీలో దివంగత పెద్ద మద్దిలేటి భార్య తిమ్మక్క(80) మృతి చెందడంతో శుక్రవారం నివాళులర్పించారు. నాలుగు పర్యాయాలు తిమ్మక్క మేజర్ పంచాయతీ సభ్యురాలిగా, ఆమె మనవడు మంగమూరి గోపాల్ కౌన్సిలర్‌గా సేవలందించారని కొనియాడారు. వారి వెంట నాయకులు మహేష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ ఉపాధ్యక్షుడు

అవుకు: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని అవుకు మండల దివ్యాంగ జేఏసీ ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జున రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వయస్సుతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్రీ వీలర్ స్కూటీ, రుణాలు పంపిణీ చేయాలని కోరారు. ఆయన వెంట వెంకటేశ్వర్లు, సురేష్ ఉన్నారు.

వాటర్‌షెడ్ పనుల్లో అవినీతిపై ఫిర్యాదు

డోన్: గ్రామసభ తీర్మానం లేకుండా డోన్ మండలంలో వాటర్‌షెడ్ పనులు జరుగుతున్నాయని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, యాపదిన్నె, మల్లెంపల్లె సర్పంచ్‌లు రామిరెడ్డి, జయన్న యాదవ్ మంత్రి బీసీకి ఫిర్యాదు చేశారు. శుక్రవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. వాటర్‌షెడ్ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- వాటర్‌షెడ్ పనుల్లో అవకతవకలపై సభ్యుల ధ్వజం



అధికార పార్టీ నాయకులకు పనులు ఎలా అప్పగిస్తారని పీఓను నిలదీస్తున్న ఎంపీపీ

డోన్: భూగర్భ జలాలను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన వాటర్‌షెడ్ పథకం అధికార పార్టీ నాయకులకు కల్పతరువులా మారిందని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆరోపించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ అతిథి గృహం ఆవరణలో జరిగిన డోన్ మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. వాటర్‌షెడ్ ఏపీఎం విజేత వ్యవహార శైలిపై ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 9 నెలల నుంచి వాటర్‌షెడ్ అమలు చేస్తున్న ఎద్దుపెంట, ఉంగరానిగుండ్ల, దొరపల్లి పంచాయతీల పరిధిలో ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా స్థానిక రైతులకు తెలియకుండానే అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే పనులను అప్పజెప్పడంతో పనులన్నీ నాశిరకంగా జరిగాయన్నారు. దీనిపై ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ వాటర్‌షెడ్ పీఓ విజేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గతంలో చేపట్టిన ఫారం పాండ్స్ పనులను తిరిగి వాటర్‌షెడ్ పనుల కింద చూపించి అధికార పార్టీ నాయకులు బిల్లులు చేయించుకుంటున్నారని సర్పంచ్‌లు ఆరోపించారు.

రైతులకే పనులు అప్పగించాలి

వాటర్‌షెడ్ కింద ఎక్కడ పనులు చేపడుతున్నారో ఆ ప్రాంతంలోని రైతులకే ఇకపై పనులు అప్పగించాలని ఎంపీపీ సూచించారు. రైతులు చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్స్ తమ పొలాల పక్కన నిర్మించుకుంటామంటూ కమిటీ ఎదుట ప్రతిపాదనలు పెడితే పనులు అప్పగిస్తామని వాటర్‌షెడ్ పీఓ విజేత హామీ ఇచ్చారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా బోర్లకు డిపెనింగ్ చేయడంతో పాటు మోటార్లకు మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌కు ఎంపీపీ సూచించారు. తమ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ తరచూ విధులకు గైర్హాజరవుతున్నారని ఎంపీటీసీ ఓబులేసు సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంకటనాయునిపల్లెలో తీవ్ర తాగునీటి సమస్య ఉందని మరో ఎంపీటీసీ జానకిరాముడు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, కన్నపకుంట, ఉడుములపాడు, కామగానికుంట్ల సర్పంచ్‌లు కళ్యాణి, రాధ, రాధమ్మ, పంచాయతీరాజ్ ఏఈ నారాయణ, ఎంఈఓ ప్రభాకర్, ఈఓఆర్డీ ఫకృద్దీన్, విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే



వరుడి కుటుంబ సభ్యులతో కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లె: పట్టణంలోని జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్‌ఖైర్ తనయుడు, ఎంపీటీసీ సభ్యుడు అబ్దుల్ తహెర్ వివాహ వేడుక జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి జయమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ మేధావి విభాగం బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన కొలిమిగుండ్ల మండలం కనకాంద్రిపల్లెకు చెందిన డాక్టర్ పెద్దదస్తగిరి శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.

పరామర్శ

బనగానపల్లె రూరల్: మండలంలోని బత్తులూరుపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యాతం శివశంకర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స తీసుకొని రావడంతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన వెంట పార్టీ నాయకులు అంబటి రవికుమార్‌రెడ్డి, సిద్ధం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పల్లె రాజేశ్వరరెడ్డి, పుచ్చా ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్యాపిలి: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్టు ఆఫీసర్ మోహన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో శుక్రవారం అటవీ శాఖ అధికారులు కళాజాత నిర్వహించారు. వన్యప్రాణులకు హాని కలిగించరాదన్నారు. వన్య ప్రాణులు జనవాసాల్లోకి వస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది వీరకుమార్, గ్రామస్తులు రామకృష్ణ, సూర్యనారాయణ గౌడ్, రాంభూపాల్, నాగరాజు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం లాభదాయకం



శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: ప్రస్తుత ఆధునిక వ్యవసాయ రంగంలో సేంద్రియ విధానం అన్ని విధాలా లాభదాయకమని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ రాష్ట్ర అధికారి మూల ప్రతాప్‌రెడ్డి అన్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఐఎన్‌డీ జీఏపీ పద్ధతిలో రైతులు సాగు చేసిన శనగ పంట, నూర్పిడి చేసిన దిగుబడుల నాణ్యతను శుక్రవారం పరిశీలించారు. సేంద్రియ పద్ధతికి సంబంధించిన పొలంబడి రికార్డులు తనిఖీ చేశారు. పురుగు మందుల అవశేషాల్లేని ఉత్పత్తులకు ఏపీఎస్‌ఓపీసీఏ సంస్థ ధ్రువ పత్రం ఇస్తుందన్నారు. సేంద్రియ ఉత్పత్తులను మార్కెట్‌లో ఇతర ఉత్పత్తుల కంటే 20 శాతం అధిక ధరకు విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. సబ్ డివిజన్ వ్యవసాయాధికారులు నిరంజన్, జ్యోతి, ప్రమీల, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల పరిశీలన



కొలిమిగుండ్ల: గుమికూడిన దరఖాస్తు దారులు



దరఖాస్తుదారుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు



ప్యాపిలి: దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు పరిశీలించారు. ఐదు బ్యాంకుల పరిధిలోని 63 యూనిట్లు మంజూరు కాగా 771 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 380 మంది మాత్రమే పరిశీలనకు వచ్చారు. ఎక్కువ భాగం అధికార పార్టీకి చెందిన అనుచర గణం దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద కూటమి నాయకులు దర్శనమిచ్చారు. మిగిలిన వాళ్లు తమకు రుణాలు మంజూరు కావని తెలిసి గైర్హాజరయ్యారు. ఒక బ్యాంక్‌కు పది యూనిట్ల చొప్పున కేటాయించారు. ఈ లెక్కన ఊరికి ఒక యూనిట్ కూడా రాదని పలువురు చర్చించుకున్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

కోవెలకుంట్ల: బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణ యూనిట్లు కేటాయించారు. ఇందులో బీసీ-ఏకు 23, బీసీ-బీకి 14, బీసీ-డీకి ఏడు, బీసీ-ఈకి 11 యూనిట్లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాలకు చెందిన 742 మంది బీసీ కులాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు పొందేందుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎస్‌బీఐ కోవెలకుంట్ల శాఖ, యూనియన్, ఏపీజీబీ, యాక్సిస్ బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వర ప్రసాదరావు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు త్వరలో రుణం మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

'కార్పొరేషన్' రుణాలకు ఇంటర్వ్యూలు

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు మేనేజర్ సుదర్శన్ రావు, ఏపీజీబీ మేనేజర్ శివసతీశ్ రెడ్డి, యూనియన్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రబాబు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 62 యూనిట్లు మంజూరు కాగా 1071 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు శుక్రవారం 602 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. శనివారం బూరుగల, మాధవరం, మునిమడుగు, నేరేడుచెర్ల, ఎస్ రాచర్ల, కొమ్మేమర్రి, జక్కసానికుంట్ల, జలదుర్గం, చంద్రపల్లి గ్రామాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

బేతంచెర్లలో 420 మంది హాజరు

బేతంచెర్ల: మండలంలో బీసీ(55), ఈబీసీ(5), కాపు(5) కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఆయా బ్యాంకుల మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 632 మంది దరఖాస్తు చేసుకోగా 420 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. అలాగే నగర పంచాయతీ పరిధిలో బీసీ(75), ఈబీసీ(2) రుణాలకు 834 మంది దరఖాస్తు చేసుకోగా ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 459 మంది హాజరైనట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు.

మాతృభాషపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు



ఎంఈఓకు సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు మాతృ భాష గురించి వివరిస్తున్న హెచ్‌ఎం

కొలిమిగుండ్ల: తెలుగు భాషకు విశిష్టమైన స్థానముందని, విద్యార్థులు మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తే ఇతర భాషలను సులువుగా నేర్చుకోవచ్చని ఎంఈఓ అబ్దుల్ కలాం సూచించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభాష దైవంతో సమానమని తెలిపారు. తెలుగు అధ్యాపకులు గుర్రప్ప, ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం నాటకం ఆకట్టుకుంది. కోలాటంతో పాటు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. ఎంఈఓను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు రాముడు, చంద్రసేనారెడ్డి, చారిస్, శివలింగారెడ్డి పాల్గొన్నారు.

మాతృభాష గొప్పది

బేతంచెర్ల: మాతృభాష కన్నతల్లి వంటిదని.. ప్రతి ఒక్కరూ గౌరవించాలని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఫర్హత్ జహాన్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్యాలు, కథలు, పాటలు, హాస్యనాటకాలు, జానపదాలు, పొడుపు కథలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మాతృ భాషను మర్చిపోవద్దు

డోన్ టౌన్: జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకున్నా మాతృ భాషను మరువకూడదని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్రపంచ మాతృ భాష దినోత్సవం పురస్కరించుకుని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో మాతృ భాష కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారిని స్మరించుకున్నారు. తెలుగు ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, రాధ, భానుప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ తెలుగు భాష విశిష్టతను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1వ తేదీ నుంచి 15 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా బనగానపల్లె జూనియర్ కాలేజీ గణిత అధ్యాపకుడు రామయ్య వ్యవహరిస్తారని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచి 195 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 107 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం



మద్దిలేటిస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సారా కేసులో నిందితునికి రిమాండ్

అవుకు: నాటుసారా కేసులో నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పిక్కళ్లపల్లితండాకు చెందిన బీముడు నాయక్ నాటుసారా తరలిస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్తం

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో ఈ నెల 24వ తేదీ మూడు నెలల పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేస్తారన్నారు. 10వ తరగతి ఆపైన చదివిన 18 నుంచి 30 ఏళ్ల యువకులు అర్హులన్నారు. వివరాలకు స్థానిక ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

మానవ హక్కులకు రక్ష

డోన్ టౌన్: మానవ హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే సత్వర న్యాయం కోసం కర్నూలులోని మానవ హక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని.. అవసరమైన సలహాలు, దరఖాస్తుల కోసం తమను సంప్రదించాలని నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ నాగమణి చేతుల మీదుగా మానవ హక్కుల ఉద్యమకారుడు దివంగ నేత బాల గోపాల్ రచించిన పుస్తకాలను విడుదల చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: పెట్నికోట-నాయినపల్లె గ్రామాల మధ్య వెలసిన గుండుమల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఏటా పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలన్నీ శుభ్రం చేయించారు. 26న శివరాత్రి సందర్భంగా సుప్రభాత సేవ, గంగా నయనం, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, లింగోద్భవ కాలాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం, కాలక్షేపం కోసం నాటక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బండలాగుడు పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు

సంజామల: మండల పరిధిలోని కమలపురి గ్రామంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దాట్ల పరమేశ్వర్‌రెడ్డి రోడ్డుపై నిలబడి ఉండగా అటు వైపు ట్రాక్టర్‌లో వచ్చిన దాట్ల రామసాగర్‌రెడ్డి, గౌరిగారి వెంకట రామిరెడ్డి దూషించి చేతితో దాడి చేశాడు. పరమేశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కొత్తపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ సాయిపురుషోత్తం పాఠశాలకు నాలుగు ప్లాస్టిక్ కుర్చీలను విరాళంగా ఇచ్చారు. శుక్రవారం హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులను కలిసి వీటిని అందజేశారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి వెంకటరెడ్డి తిరునాల

ప్యాపిలి: స్థానిక వెంకటరెడ్డి ఆలయ ప్రాంగణంలో జీవసమాధి పొందిన అవధూత వెంకటరెడ్డి మహిమాన్వితుడిగా స్థానికులు కొలుస్తున్నారు. శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఆదివారం తేరు లాగే కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. కాగా అయితే దశాబ్దకాలం క్రితం తేరు చక్రాలు విరిగిపోయాయి. దీంతో తేరును మూలనపడేసి దాని స్థానంలో ఎడ్ల బండిని ఉంచి భక్తులు దాన్నే తేరులాగా లాగుతున్నారు. భక్తులు దీన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాదైనా కొత్త తేరుతో తిరునాల జరపాలని కోరుతున్నారు. సుమారు 150 ఏళ్ల నుంచి ఇక్కడ తిరునాల జరుగుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



డిప్యూటీ డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. కోవెలకుంట్ల ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల డిప్యూటీ డీఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వెంకట్రామిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీపతి, కృష్ణవేణి, నాగేశుడు, ఉపాధ్యాయులు మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టమాట మార్కెట్ పరిశీలన



టమాట మార్కెట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్యాపిలి: స్థానిక టమాట మార్కెట్‌ను శుక్రవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, మార్కెటింగ్ ఏడీ అబ్దుల్ రహిమాన్ తదితరులు పరిశీలించారు. మార్కెట్‌కు వస్తున్న టమాట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో తమకు ధర గిట్టుబాటు కావడం లేదని పలువురు రైతులు అధికారుల వద్ద వాపోయారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను తీసుకున్న అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. రైతుల నుంచి మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వమే టమాటను కొనుగోలు చేసి హోటల్లు, హాస్టల్‌లు, రైతుబజార్లకు పంపాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అని అధికారులు తెలిపారు. ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, మార్కెట్ యార్డు సెక్రటరీ మాధవకృష్ణారెడ్డి ఉన్నారు.

ఉమామహేశ్వరుని సేవలో కాటసాని



స్వామివారి తీర్థప్రసాదం స్వీకరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, అర్చన, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు మహేశ్వరశర్మ, ఈఓ చంద్రుడు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ మరియదాసు తెలిపారు. మార్చి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 24వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.